సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 4 । డిసెంబర్ । 2024



పోలీసుల ముమ్మర తనిఖీలు

మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో ఏవోబీ సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. 8లో



పట్టుచీర నేతతో మరింత ఉపాధి

పట్టు పురుగుల పెంపకంతోపాటు పట్టు చీర నేత శిక్షణ పొందాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ సూచించారు. 8లో



ఆర్టీసీ లీజు స్థలంలో మద్యం షాపు

పాడేరులో ఆర్టీసీకి చెందిన లీజు స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం ఏర్పాటుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 8లో

న్యూస్‌రీల్

ఉపాధ్యాయ ఓటర్లకు ప్రత్యేక సెలవు మంజూరు

- కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని ఉపాధ్యాయ ఓటర్లకు ఉపాధ్యా ఎమ్మెల్సీ పోలింగ్ రోజున ప్రత్యేక క్యాజువల్ లీవ్‌ను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మంజూరు చేశారని కలెక్టర్ దినేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

వైద్య సేవలపై ఆరా



వైద్యసేవల వివరాలను వైద్యాధికారి నుంచి తెలుసుకుంటున్న పీవో కట్టా సింహాచలం

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పీహెచ్‌సీని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. మందుల వివరాలను వైద్యాధికారి నాగార్జున నుంచి తెలుసుకున్నారు. ఆయనతో పాటు అసిస్టెంట్ కలెక్టర్ భావన పాల్గొన్నారు.

కొత్తవీధి ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సస్పెన్షన్

రంపచోడవరం: దేవీపట్నం మండలం కొత్త వీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం టీఎస్ఎన్ మూర్తిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎ.విజయశాంతి తెలిపారు. డిప్యూటేషన్‌పై తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆయన అదే పాఠశాలలో విద్యార్థిని, ఉపాధ్యాయుల పట్ల తప్పుడుగా ప్రవర్తించినట్టు రాజమహేంద్రవరం డీఎస్‌టీడబ్ల్యూ అండ్ ఈవోకు నవంబర్ 30న హెచ్‌ఎం ఫిర్యాదు చేసినట్టు ఆమె తెలిపారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో సీడీపీవో, డీఎస్‌టీడబ్ల్యూ అండ్ ఈవోల సంయుక్త విచారణ నిర్వహించారు. ఈ మేరకు నివేదికను రాజమహేంద్రవరం కలెక్టర్‌కు, రంపచోడవవరం ఐటీడీఏ పీవో కట్టా సింహచలంకు అందజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టీఎస్ఎన్ మూర్తిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు.

ఆపరేటర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు : జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని 22 మండలాల్లో చైల్డ్ ఆధార్ నమోదు చేసేందుకు అర్హత కలిగిన ఆపరేటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆధార్ జిల్లా కోఆర్డినేటర్ మూర్తశ్రీను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023, 2024 సంవత్సరాల్లో ఎన్ఎస్ఈఐటీ ఆధార్ పరీక్షల్లో ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులకు ఆధార్ ఆపరేటర్లుగా పని చేసేందుకు అవకాశం కల్పిస్తామని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 6281692319, 9494691510 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతూ శిశువు మృతి



విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన శిశువు

జి.మాడుగుల: మండలంలో చినబందవీధి గ్రామానికి చెందిన శిశువు గుండెకు సంబంధించి వ్యాధితో విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. వేముల అర్జున్, రమాకుమారి దంపతులకు చెందిన మూడు నెలల పాప కొంతకాలంగా గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. దీంతో చికిత్స కోసం పాడేరు ఆస్పత్రికి తల్లిదండ్రులు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తల్లిదండ్రులు తెలిపారు.

ప్రభుత్వ భూముల సంరక్షకులు రెవెన్యూ అధికారులే

కలెక్టర్ దినేష్ కుమార్

8లో



చింతూరు మండలం లక్ష్మీపురంలో వరి కోతల్లో నిమగ్నమైన మహిళా కూలీలు

మిగిలేదేంటి?

వరి సాగు గిట్టుబాటు కాక గిరి రైతుల ఆవేదన

వరి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. ఏటా ఏదొకరకంగా నష్టపోతూనే ఉన్నారు. ఈ ఏడాది పెట్టుబడులు పెరిగాయి. ఒకపక్క ప్రకృతి కన్నెర్ర.. మరోపక్క దిగుబడి తగ్గడంతో సతమతమవుతున్నారు. సాగు పెట్టుబడి జమ చేస్తామన్న ప్రభుత్వం కూడా దగా చేయడంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టారు. అందుకు తగ్గట్టుగా ఆదాయం వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేకుండా పోయిందని గిరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఎకరాకు రూ.40 వేల మేర పెట్టుబడి
- ఎకరాకు సుమారు 30 బస్తాల దిగుబడి
- వడ్డీ కలిపితే మిగిలేది శూన్యమే
- పూర్తిస్థాయిలో తెరచుకోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- దళారులపై ఆధారపడాల్సిన దుస్థితి
- దయనీయంగా అన్నదాత పరిస్థితి

చింతూరు: జిల్లావ్యాప్తంగా వరి కోతలు ఊపందుకున్నాయి. వరి నూర్పిడి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో తెరచుకోనందున ఎవరికి అమ్ముకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. జిల్లావ్యాప్తంగా 46 కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు పౌరసరఫరాలశాఖ ప్రకటించినా వీటిలో ఆరు కేంద్రాల్లో మాత్రమే కొనుగోళ్లు జరుగుతున్నాయి. జిల్లాలో 28 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 611 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు.

52 వేల హెక్టార్లలో..

జిల్లాలో ఖరీఫ్‌లో 52 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ఎంటీయూ–1127, ఎంటీయూ–1064, ఎంటీయూ–7029, ఆర్‌జీఎల్–2537, బీపీటీ–5204 రకాలతో పాటు చింతూరు డివిజన్లో 1001, 1010 రకాలను వేశారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో సుమారు 50 శాతం మేర కోతలు జరిగాయి. వీటిలో 30 శాతం పంటను మాత్రమే ఒడ్డుకు తరలించి కుప్పలు వేశారు. మిగతా 20 శాతం పైరుకు సంబంధించి వరి పనలు పొలాల్లోనే ఉన్నాయి. ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి కాగా సుమారు 30 బస్తాల మేర దిగుబడి వచ్చింది. దీంతో ఏమీ మిగిలేది లేకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

ధాన్యం గింజ నాణ్యతపై ప్రభావం

తుపాను కారణంగా కురిసిన వర్షాలకు తడిచిపోయాయి. పెద్దగా నష్టం లేదని వ్యవసాయశాఖ చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. వరి పనలు తడవడం వల్ల గింజ పటుత్వం దెబ్బతింటుందని, దీని ప్రభావం ధరపై కూడా ఉంటుందని గిరి రైతులు వాపోతున్నారు. పాడేరు డివిజన్‌లో 1,45,176, రంపచోడవరం డివిజన్లో 43,624, చింతూరు డివిజన్లో 28,340 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని జిల్లావ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాకు రూ 2,320, సాధారణ రకానికి రూ 2,300 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించింది. అయితే వర్షాలు, వరదల వల్ల పంటలు దెబ్బతినడంతో ఈ ఏడాది దిగుబడులు బాగా తగ్గినందున రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర పెంచాలని గిరి రైతులు కోరుతున్నారు.

ధర పెంచాలి..

పెట్టుబడి, కూలిధరలు పెరిగిన నేపథ్యంలో ఈ ధర ఏమాత్రం గిట్టుబాటు కాదని రైతులు వాపోతున్నారు. నాట్లు వేసిన తరువాత చింతూరు డివిజన్‌లో రెండు సార్లు వరదలు సంభవించాయి. దీంతో దెబ్బతిన్న చాలామందికి నేటికీ వరద నష్ట పరిహారం అందలేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం అందలేదు



నదీ పరివాహక ప్రాంతంలో సన్నరకం ఎకరా విస్తీర్ణంలో సాగు చేపట్టా. ఈ ఏడాది వరదలకు మునిగి మొత్తం పాడయింది. పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరిగినా చూస్తాం, రాస్తాం అని చెప్పారు. అయితే ఇంతవరకు పరిహారం ఇవ్వలేదు. – పాయం రామయ్య, రైతు, చూటూరు, చింతూరు మండలం

ధర పెంచితే బాగుంటుంది



ఈ ఏడాది వరదలకు పంటలు నీట మునిగాయి. అందువల్ల తిరిగి రెండోసారి వేయాల్సి రావడంతో పెట్టుబడి ఎక్కువైంది. దిగుబడి కూడా తక్కువగా ఉంది. ప్రభుత్వం మద్దతు ధర మరింత పెంచితే రైతులకు లాభదాయకంగా ఉంటుంది. – పూరి విజయ, మహిళా రైతు, లక్ష్మీపురం, చింతూరు మండలం

దళారులను నమ్మి మోసపోవద్దు

ఈ ఏడాది జిల్లాలో 46 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే కొన్నిచోట్ల కేంద్రాలను ప్రారంభించాం. ధాన్యం విక్రయించిన రైతులకు త్వరితగతిన నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. రైతులు దళారుల మాటలు నమ్మి తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకుని నష్టపోవద్దు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడం వల్ల మంచి ఆదాయం పొందవచ్చు. – గణేష్‌కుమార్,డీఎం, పౌరసరఫరాలశాఖ



రాజవొమ్మంగి: యంత్రంతో వరి నూర్పిడి



రాజవొమ్మంగి: ధాన్యాన్ని ఆరబెడుతున్న వరి రైతులు

పెట్టుబడి సాయం అందక..

ఈ ఏడాది రైతులకు ప్రభుత్వం నుంచి సాగు పెట్టుబడి అందకపోవడంతో చాలామంది అధికవడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేపట్టారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించి కొంతవరకైనా అప్పులు తీర్చుకుందామని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. పూర్తిస్థాయిలో కేంద్రాలు తెరచుకోనందున దళారులు, ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతుల ఆర్థిక పరిస్థితిని గమనించిన వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు గ్రామాల్లో మకాం వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో భరోసా లభించకపోవడంతో అధిక వడ్డీల బాధనుంచి బయట పడేందుకు వారికి అమ్మాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నామని రైతులు వాపోతున్నారు.

గిడ్డి ఈశ్వరికి ఏ హోదా ఉందని సమీక్షలు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు

- వైఎస్సార్‌సీపీ నేతల ధ్వజం
- అధికారులు తీరు మార్చుకోవాలని సూచన
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక

పాడేరు : గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఏ హోదాలో అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీకి చెందిన వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు ప్రశ్నించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికై తన స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ ఫిరాయించి టీడీపీలో చేరిన గిడ్డి ఈశ్వరిని గత పదేళ్లుగా ప్రజలు చిత్తుగా ఓడించారన్నారు. గిడ్డి ఈశ్వరి టీడీపీ పార్టీకి మాత్రమే నాయకురాలని, అంతేకానీ ప్రజల చేత ఎన్నుకున్న ప్రతినిధి కాదన్నారు. ఈ విషయాన్ని ఆమెతో పాటు అధికారులు గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. కొంతమంది మండల స్థాయి అధికారులు సైతం ఆమె జపం చేయడం సరికాదని ధ్వజమెత్తారు. ఆమె ఏ హోదా ఉందని రివ్యూ సమావేశాలకు హాజరవుతున్నారని ప్రశ్నించారు. అధికారులతో రివ్యూ నిర్వహించే అధికారం స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు మాత్రమే ఉందన్న విషయం అధికారులకు తెలియదా అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఆమెను ఎలా ఆహ్వానిస్తున్నారని ప్రశ్నించారు. మండల పరిషత్ కార్యాలయంలో రివ్యూ ఏర్పాటు చేసిన అధికారులకు ప్రజల ఓట్లతో ఎన్నికైన వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గుర్తుకు రాలేదా విమర్శించారు. మండల స్థాయి అధికారులు ఈ విషయం తెలుసుకోవాలన్నారు. ఈ వ్యవహారంపై వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులంతా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ కూతంగి సూరిబాబు, ఎంపీటీసీలు కె.నర్సింహమూర్తి, ఎల్.రామకృష్ణపాత్రుడు, డి. సన్యాసిరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, సర్పంచ్‌లు గబ్బాడ చిట్టిబాబు, గొల్లోరి నీలకంఠం, ఎస్. లక్ష్మణరావు, మాజీ సర్పంచ్‌లు శరభ సూర్యనారాయణ, పాంగి నాగరాజు, కన్నాపాత్రుడు, సిరగం దశమూర్తి, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు డీపీ రాంబాబు పాల్గొన్నారు.

టెన్త్ ఉత్తీర్ణతే భవిష్యత్తుకు తొలిమెట్టు

జిల్లావిద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు



కూనవరం హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

కూనవరం: ప్రతి విద్యార్థికి జీవితంలో 10వ తరగతి తొలి మెట్టు అని మంచి మార్కులు సాధిస్తే వెనుదిరిగి చూసే పరిస్థితి ఉండదని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు సూచించారు. మండల పరిధిలోని పలు పాఠశాలలను మంగళవారం అయన అకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, విజయసాధన, మాంటిస్సోరీ హైస్కూళ్లు, మర్రిగూడెం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం పెడుతున్నారా లేదా అని ఆరాతీశారు. మూడు నెలల నుంచి బియ్యం రావడంలేదని హెచ్‌ఎం చిచ్చడి అప్పారావు తెలిపారు. భోజన పథకం నిర్వాహకులే బియ్యాన్ని సమకూరుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మార్చిలో జరిగే పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు నిర్దేశించిన 100 రోజుల ప్రణాళిక వివరాలను ఆయన హెచ్‌ఎంల నుంచి తెలుసుకున్నారు. అనంతరం టెన్త్ విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. పలు ప్రశ్నలకు వారి నుంచి సమాధానాలు రాబట్టారు. ఈ పర్యటనలో ఎంఈవో–2 లక్ష్మయ్య పాల్గొన్నారు.

12 మంది ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు

- లబ్ధిదారుల వివరాల నమోదు, బ్యాంక్ ఖాతాల ప్రారంభించడంలో నిర్లక్ష్యం
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్ ఆగ్రహం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో లబ్ధిదారుల వివరాలు నమోదు చేయకపోవడంతోపాటు, బ్యాంక్ ఖాతాలు ప్రారంభించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 12 మంది ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్టు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి వ్యవసాయ శాఖ, ఉద్యానవనశాఖ, ఐసీడీఎస్, పశుసంవర్థక శాఖ, ఉపాధి హామీ అధికారులతో అభివృద్ధి పనులు, పథకాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంకా 27,567 మంది లబ్ధిదారుల వివరాలను వెబ్‌సైట్లో నమోదు చేయలేదన్నారు. చింతపల్లి, పెదబయలు, వై. రామవరం, కూనవరం, అనంతగిరి, మారేడుమిల్లి, డుంబ్రిగుడ, రంపచోడవరం, ఎటపాక, వీఆర్ పురం, ముంచంగిపుట్టు, జి.మాడుగుల మండలాల ఎంపీడీవోలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయానుబంధ పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో 64వేల మంది జాబ్‌కార్డుదారులకు వందరోజుల పని దినాలు పూర్తి చేయాలనే లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ప్రతీ మండలంలో 100 ఫారం పాండ్ల నిర్మాణాలను ఈ నెలఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం లక్ష్యంపై ఎంపీడీవోలు దృష్టిసారించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోషకాహార లోపం, బరువు తక్కువ ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. రైతులకు పీఎం కిసాన్ పథకం వర్తింపజేసేందుకు ఈకేవైసీ, ఆధార్ అనుసంధాన ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఇంకా 982 మందికి ఆధార్ లింక్ చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. రైతుల పంటలకు బీమా పథకాలు అమలు చేయాలని సూచించారు. చింతూరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలోని రైతులకు రాయితీపై ఉద్యానవన పరికరాలు మంజూరు చేయాలని సూచించారు. పశు సంపదకు జియో ట్యాగింగ్ చేయాలని కోరారు. ఎటపాక, దేవీపట్నం మండలాల్లో మత్స్యకారులకు చేపల వేటపై తగిన శిక్షణ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, ప్రత్యక్షంగా జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్‌బీఎస్ నందు, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి రమేష్‌కుమార్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి లవరాజు, సెరీకల్చర్ ఏడీ అప్పారావు, 22 మండలాల ఎంపీడీవోలు, సీడీపీవోలు, ఉపాధి హామీ ఏపీవోలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

డోలీలో గర్భిణి తరలింపు



ఉసరికపాడు నుంచి డోలీలో గర్భిణిని తరలిస్తున్న స్థానికులు

కొయ్యూరు: డోలిమోతలు లేకుండా చేస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలు నీటిమీద రాతలుగా మారాయి. మండలంలోని డోలీలో రోగులను తరలించడమే ఇందుకు ఉదాహరణ. డౌనూరు పంచాయతీ ఉసిరికపాడుకు చెందిన గర్భిణి వంతల లక్ష్మికి మంగళవారం పురిటి నొప్పులు వచ్చాయి. రహదారి పూర్తిగా లేకపోవడంతో ఉసరికపాడు నుంచి లక్ష్మిని భర్త భాస్కరరావు, బంధువులు ఐదు కిలోమీటర్ల దూరంలోని గుమ్మనిపాలెం వరకు డోలీలో మోసుకు వచ్చారు. అక్కడ నుంచి వాహనంలో డౌనూరు ఆస్పత్రికి తరలించారు. రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారు వివరించారు. రహదారి మంజూరైనా పనులు పూర్తి చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

చెరువులవేనం వ్యూపాయింట్ మూసివేత

తాత్కాలికంగా చెక్‌పోస్టు ఏర్పాటు



చెరువులవేనం వ్యూపాయింట్‌కు వెళ్లే దారిలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద రెవెన్యూ సిబ్బంది

చింతపల్లి: భారీ వర్షాల నేపథ్యంలో పర్యాటకుల భద్రతను దృష్టిలో పెట్టుకుని చెరువులవేనం వ్యూపాయింట్‌ను తాత్కాలికంగా మూసివేసినట్టు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పర్యాటక సీజన్ కావడంతో వారాంతాల్లో దూర ప్రాంతాలనుంచి పర్యాటకులు వస్తున్నారన్నారు. చెరువులవేనం కొండపైకి వెళ్లే ప్రధాన రహదారి అసంపూర్తిగా ఉండటంతోపాటు కొండచరియలు విరిగిపడే అవకాశాలు ఉన్నాయన్నారు. అందువల్ల ఈ రహదారిని తాత్కాలికంగా మూసివేయాలని కలెక్టర్ ఆదేశించినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు రెవెన్యూ సిబ్బందిని పంపించి తాత్కాలికంగా రహదారిని మూసివేసినట్టు ఆయన పేర్కొన్నారు. అక్కడ ప్రధాన మార్గంలో తాత్కాలిక చెక్‌పోస్టును ఏర్పాటుచేసినట్టు తహసీల్దార్ తెలిపారు.

విజ్ఞానయాత్రకు రాయపూర్ వెళ్లిన రైతులు



విజ్ఞాన యాత్రకు సిద్ధమైన రైతులు,వ్యవసాయ, ఉద్యానవన అధికారులు

ముంచంగిపుట్టు: విజ్ఞానయాత్రకు ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలకు చెందిన 17 మంది గిరిజన రైతులు మంగళవారం రాయపూర్ బయలుదేరి వెళ్లారు. జిల్లా వనరుల కేంద్రం,పాడేరు, విశాఖపట్నం ఆత్మ సౌజన్యంతో ఈ యాత్ర ఏర్పాటుచేశారు. ప్రత్యేక బస్సులో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రాయపూర్‌లోని ఇందిరా గాంధీ కృషి విశ్వ విద్యాలయానికి వెళ్లారు. చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ విధానం, కూరగాయ సాగులో యాజమాన్యం, నూతన వంగడాలపై అవగాహన పొందుతారని మండల వ్యవసాయాధికారులు విజయలక్ష్మి, శ్రీనివాసబాబు, లీలావతి తెలిపారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు రైతులతో పాటు వ్యవసాయ,ఉద్యాన సహాయకులకు శిక్షణ అందిస్తారని వారు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ లీజు స్థలంలో మద్యం షాపు

- నిబంధనలు ఉల్లంఘించినా పట్టించుకోని అధికారులు

పాడేరు : స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన లీజు స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం ఏర్పాటుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వేరే వ్యక్తులు లీజుకు తీసుకున్న ఈ స్థలంలో ఇటీవల దుకాణాలు నిర్మించారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థలంలో మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు అనుమతి లేదు. అయినా అధికారులు పట్టించుకోలేదు. దీనిపై ఆర్టీసీ డిపో మేనేజర్ ఉమా మహేశ్వరరెడ్డిని వివరణ కోరగా ఆర్టీసీ స్థలంలో మద్యం దుకాణం ఏర్పాటుకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని తక్షణమే తొలగించాలని నిర్వాహకులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. వారు గడువులోగా తొలగించకపోతే తామే తొలగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మంగళవారం ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను ప్రశ్నించి విడిచిపెట్టారు. సీఆర్పీఎఫ్ బలగాలు మండల కేంద్రంలో గస్తీ నిర్వహించాయి. జోలాపుట్టు నైట్ హాల్ట్ బస్సులను సైతం మండల కేంద్రానికే పరిమితం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మావోయిస్టుల వారోత్సవాల వల్ల నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా సోదాలు చేస్తున్నామన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మర్రిపాలెం(విశాఖ): అక్రమంగా ఆటోలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు కంచరపాలెం పోలీసులు మంగళవారం బిర్లా జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో కంచరపాలెం నుంచి బిర్లా జంక్షన్ వైపు సర్వీస్ రోడ్డులో వస్తున్న ఆటోను గుర్తించి 20 బ్యాగ్‌ల్లో (990 కేజీలు) అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. గోపాలపట్నం కొత్తపాలేనికి చెందిన ఆటో డ్రైవర్ అశోక్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు. కంచరపాలెం సీఐ చంద్రశేఖర్ నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుచీర నేతతో మరింత ఉపాధి

- చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్

కూనవరం: పట్టు పురుగుల పెంపకంతో ఉపాధి పొందుతున్న గిరిజన రైతులు దారం తీయడమే కాకుండా పట్టు చీర నేసేలా శిక్షణ పొందాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ సూచించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ టీంతో మంగళవారం పైదిగూడెం గ్రామాన్ని సందర్శించారు. టస్సార్ పట్టుపురుగుల పెంపకంతో ఉపాధి పొందుతున్న గిరిజనులు చీరలు కూడా తయారు చేయగలిగితే మంచి ఆదాయం పొందవచ్చని ఆయన సూచించారు. అమరావతి నుంచి వచ్చిన డిజైన్ టీం సభ్యులు రైతులతో సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ సెరీకల్చర్ అధికారి హరికృష్ణ, తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల సంరక్షకులు

రెవెన్యూ అధికారులే



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్వో పద్మలత



హాజరైన రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు

- రెవెన్యూ అధికారుల పనితీరు సక్రమంగా లేదు
- అవినీతికి పాల్పడితే క్రిమినల్ కేసులు
- 5 నుంచి రెవెన్యూ సదస్సులు
- కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : రెవెన్యూ అధికారులు, ఉద్యోగుల పనితీరు సక్రమంగా లేదని, రెవెన్యూ శాఖలో ఎవరైన అవినీతి, అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు తప్పవని, అవినీతికి పాల్పడిన వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తామని కలెక్టర్ దినేష్ కుమార్ హెచ్చరించారు. పట్టణంలో వీఆర్ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూములకు రెవెన్యూ అధికారులే ప్రధాన సంరక్షకులన్నారు. రెవెన్యూ శాఖ అధికారుల పనితీరు చాలా మెరుగుపడాలని తెలిపారు. ప్రభుత్వ పరమైన పౌరసేవలు అందించడంలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కుల, ఆదాయ, ధ్రువీకరణ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన జారీ చేయాలన్నారు. మ్యుటేషన్ల ప్రక్రియ పక్కాగా జరగాలని తెలిపారు. ఈనెల 5నుంచి 8వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో 60 శాతం సమస్యలు స్థానికంగానే పంచాయతీల్లో పరిష్కారం జరగాలని చెప్పారు. రెవెన్యూ సదస్సులపై ముందుగా షెడ్యూల్ ప్రకటించాలని సూచించారు. భూ ఆక్రమణలపై 15 రోజుల్లో పూర్తి స్థాయి సర్వే నిర్వహించాలని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం జరిగితే వెంటనే స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, ఈవోపీఆర్డీలు ప్రభుత్వ భూములపై ఆడిట్ నిర్వహించాలని సూచించారు. ఆక్రమణలపై తీసుకున్న చర్యలను స్పష్టంగా నివేదించాలన్నారు. మండల స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలు కలెక్టర్ వరకు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. రీ సర్వేపై గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రీసర్వే ప్రక్రియ ప్రారంభించాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ మీకోసంలో వస్తున్న ఫిర్యాదుల సమస్యలను తక్షణమే పరిష్కారించాలన్నారు. భూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సేవా పరమైన సమస్యలకు వీఆర్వోలే బాధ్యత వహించాలని చెప్పారు. వీఆర్వోలు, తహసీల్దార్లు కార్యాలయాల్లో రికార్డులను పక్కాగా నిర్వహించాలని, మండల స్థాయిలో వస్తున్న ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్వో పద్మాలత, పీఎంయూ ప్రోగ్రాం అధికారి రాంగోపాల్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, సర్వే అధికారులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీని తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో



వై.రామవరం సీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

వై.రామవరం: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం మంగళవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సౌకర్యాలపై ఆరా తీశారు. ఆస్పత్రి పరిధిలో గర్భిణుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేయాలని తెలిపారు. అనంతరం పి.ఎర్రగొండలోని ఏకలవ్య పాఠశాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న పాఠశాల భవనాల పనులను పరిశీలించారు. పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అనారోగ్యానికి గురైతే వెంటనే సమీప ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందజేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. గిరిజన సంక్షేమశాఖ ఈఈ ఐ.శ్రీనివాసరావు, డీఈ నాగరాజు, ఏకలవ్య ప్రిన్సిపాల్ పి.రామకృష్ణ పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా



సమావేశానికి హాజరైన ఆశా కార్యకర్తలు

డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

డుంబ్రిగుడ: క్యాన్సర్‌ను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా సూచించారు. మంగళవారం ఆయన డుంబ్రిగుడ, కిల్లోగుడ పీహెచ్‌సీల్లో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయాలని సూచించారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. గ్రామాల్లో మలేరియా, టైఫాయిడ్ సోకకుండా వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పి.రాంబాబు, అంబిక రమణి, నాజీబీబ్, కుమార్‌రత్న, ఎంపీహెచ్ ఈవోలు శౌరీ, ఎస్, జానకమ్మ, సూపర్‌వైజర్ రామారావు, పీహెచ్‌ఎన్ రత్న, హెచ్‌వీలు పద్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఏయూ విద్యార్థులకు 'కాగ్నిజెంట్' మెరిట్ స్కాలర్‌షిప్



విద్యార్థులకు నమూనా చెక్కును అందచేస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగంలో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ చదువుతున్న విద్యార్థులకు కాగ్నిజెంట్ ఫౌండేషన్ మెరిట్ స్కాలర్‌షిప్ అందజేసింది. మొత్తం పది మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.70 వేలు చొప్పున మొత్తం రూ.7లక్షల సహాయం చేసింది. ఈ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమచేసింది. ఈ సందర్భంగా స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులను వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి స్కాలర్‌షిప్ అందించిన కాగ్నిజెంట్ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ ఏటా తమ విభాగంలోని విద్యార్థులకు కాగ్నిజెంట్ ఫౌండేషన్ ఆర్థిక సహకారం అందిస్తోందన్నారు. ఏయూ అలుమ్ని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కుమార్ రాజా, విద్యా విభాగం అధ్యాపకులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ మూర్తి, డాక్టర్ రాము తదితరులు పాల్గొన్నారు.

అల్లుడే ఇంటి దొంగ

రోలుగుంట : ఇంటి దొంగే నగలు చోరీకి పాల్పడి పోలీసులకు పట్టుబడ్డ ఘటన శరభవరంలో జరిగింది. గ్రామంలోని ఊట నూకరాజు ఇంట్లో ఏడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు ఫిర్యాదు అందగా ఎస్ఐ పి.రామకృష్ణారావు, తన సిబ్బందితో కలిసి అరగంటలోనే కేసును ఛేదించి దొంగను పట్టుకున్నారు. ఎస్ఐ విలేకరులకు అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఊట నూకరాజు తన భార్య లక్ష్మితో కలసి ఈ నెల1వ తేదీన పొలం పనులకు వెళ్లిపోయారు. వారు ఇంటికి వచ్చి చూసేసరికి బీరువా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో ఏడు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో రోలుగుంట పోలీసులకు ఈ నెల రెండో తేదీన బాధితుడు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సంఘటన స్థలానికి వెళ్లి క్లూస్ టీంతో విచారణ జరిపారు. సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించారు. ఒక వ్యక్తి హెల్మెట్ ధరించి స్కూటీపై ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 7 గంటల వరకూ గ్రామంలో సంచరించినట్టు తెలుసుకున్నారు. ఆనవాళ్ల మేరకు ఎస్ఐ అనుమానిత వ్యక్తి అయిన గృహ యజమాని అల్లుడు లాలం సింహాచలంకు ఫోన్ చేసి ఎక్కడున్నారని ఆరా తీయగా తాను గ్రామానికి రాలేదని వేరే పనిమీద వైజాగ్ వెళ్లినట్టు తెలిపాడు. అయితే దర్యాప్తులో భాగంగా అతని కాల్ డేటా పరిశీలించిన మీదట అనుమానితుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నేరం అంగీకరించాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తలుపులు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి, బీరువా తెరిచి ఆభరణాలు దొంగలించినట్టు అంగీకరించాడు. వాటిని తన స్కూటీలోనే దాచి నర్సీపట్నం వెళ్లి విక్రయించే ప్రయత్నంలో పోలీసులకు పట్టుబడ్డాడు. ఫిర్యాదు అందిన అరగంటలోనే కేసును ఛేదించిన విషయం తెలిసిన ఎస్పీ రోలుగుంట ఎస్ఐ రామకృష్ణారావు, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో పాల్గొన్న కొత్తకోట సీఐ తమ సిబ్బందిని అభినందించారు.

వరిలో మానిపండు తెగులుపై దృష్టి సారించాలి

అనకాపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో మానిపండు తెగులు ఆశించే అవకాశం ఉందని, దీనిపై రైతులు దృష్టి సారించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు సూచించారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కంకులతో ఉన్న వరి పొలంలో మానిపండు తెగులు ఆశించినట్లయితే, నివారణకు తెగులు ఆశించిన కంకులను జాగ్రత్తగా తీసివేసి పొలానికి దూరంగా తీసుకెళ్లి నాశనం చేయాలన్నారు. అలాగే కార్బెండజిం 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. గత వారం వర్షాలు, గాలులకు పడిన వరి పనలను లేపి నిలబెట్టాలన్నారు. అప్పుడే గింజ రంగు మారకుండా నాణ్యత దెబ్బతినకుండా ఉంటుందన్నారు. వరి పొలం కంకులతో ఉన్నట్లయితే మొలక రాకుండా ఒక లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. కోసిన పనలు పొలంలో తడిచినట్లయితే అవసరాన్ని బట్టి ఎకరానికి 25 కేజీల ఉప్పును కోసిన పనలపై చల్లితే గింజ రంగు మారకుండా ఉంటుందన్నారు. ఎండరాగానే పనలను తిరగేసి ఆరబెట్టిన తరువాత నూర్చుకోవాలన్నారు. రబీలో వరి వేసే రైతులు నారుమడి వేసుకోవచ్చని, ఎకరానికి 20–25 కిలోల వరి విత్తనం సరిపోతుందన్నారు. దుక్కిలో 5 సెంట్ల నారుమడికి 2.2 కిలోల యూరియా, 6.25 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 1.6 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలని ఆయన సూచించారు. నారుమడి వేసిన 4–7 రోజులప్పుడు కలుపు నివారణ పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్‌కలుపు మందును ఎకరానికి 100 గ్రా.ల చొప్పున 25 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలన్నారు. రబీలో రాగి వేసే రైతులు ఎకరానికి 2.5 కిలోల విత్తనం చొప్పున నారు వేసుకోవచ్చని, 5 సెంట్ల నారుమడికి 1.5 కిలోల యూరియా, 4 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 1.0 కిలో మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలన్నారు.

8న విశాఖపురి మేరీమాత పండగ

- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా తరలిరానున్న భక్తులు
- పెద్ద ఎత్తున ఉత్సవ ఏర్పాట్లు



ప్రధాన ఆలయం

డాబాగార్డెన్స్(విశాఖ): నగరంలోని పాత పోస్టాఫీస్ వద్ద గల కొండగుడి (రోజ్‌హిల్స్)పై కొలువుదీరి కులమతాలతో సంబంధం లేకుండా భక్తులంతా కొలిచే తల్లి అమలోద్భవి(విశాఖపురి మేరీమాత). రోస్‌హిల్స్‌పై వెలసిన మేరీ మాత పుణ్యక్షేత్రం విశాఖపురికి ప్రత్యేక ఆభరణం. దీనినే 'కొండగుడి'గా భక్తులు పిలుచుకుంటారు. ఏటా డిసెంబరు 8వ తేదీన జరిగే కొండగుడి పండగకు హిందూ, ముస్లిం, కథోలిక, కథోలికేతర క్రైస్తవులు అశేషంగా తరలివస్తారు. కొండమాత ఉత్సవాలు దాదాపు తొమ్మిది రోజుల పాటు సాగుతాయి. వీటిలో చివరి రోజున మాతను దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు వస్తారు. కాగా.. ఈ ఉత్సవాలు గత నెల 29వ తేదీన ప్రారంభమయ్యాయి. ఈ నెల 8వ తేదీ ఆదివారం వరకు జపమాల, దివ్యపూజ, స్వస్థత ప్రార్థనలు నిర్వహిస్తారు. కొండగుడిపై వెలసిన అమలోద్భవి మాత పట్ల అపారమైన నమ్మకం గల భక్తులు ఇక్కడ తలనీలాలు సమర్పించుకొని, అమ్మ ముందు మోకరిల్లుతారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే గాక ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి భక్తులు వచ్చి తమ మొక్కులు తీర్చుకుంటారు.

వేకువజాము 4.30 గంటలకు, తిరిగి 5.15, 6 గంటలకు ఆలయంలో ఆంగ్లంలో దివ్యపూజ, ఉదయం 5, 6 గంటలకు గుహవద్ద తెలుగులో దివ్యపూజ, 7.30 గంటలకు గుహ వద్ద తెలుగులో పొంటిఫికల్ దివ్య పూజాబలి నల్గొండ పీఠాధిపతి కరణం ధమన్‌కుమార్‌చే నిర్వహిస్తారు. ఉదయం 10, 11, 12 గంటలకు గుహవద్ద నూతన గురువులచే తెలుగులో దివ్యపూజ చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు దివ్యసత్ప్రసాద ఆరాధన కార్యక్రమం, రాజమండ్రి విచారణ కర్త ఫాదర్ ఈగల రవీంద్రకుమార్‌చే దివ్యసత్ప్రసాద ఆరాధన ఏర్పాటు చేశారు. అనంతరం విశాఖపురి మేరీమాత ద్వైమాస పత్రిక బైబిల్ క్విజ్, బైబిల్ పదకేళిలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తారు. సాయంత్రం 5, 6 గంటలకు గుహ వద్ద తెలుగులో దివ్యపూజ జరపనున్నారు.

పెద్ద ఎత్తున ఉత్సవ ఏర్పాట్లు..

అమలోద్భవి మాత ఉత్సవం పురస్కరించుకొని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. భక్తులు ఆలయానికి సమర్పించే బంగారు, వెండి ఆభరణాలను ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో ఉంచారు. పండగ రోజుల్లో భక్తులు వీటిని సందర్శించేందుకు అనుమతి కల్పించారు. ఉత్సవాలకు వచ్చేవారి సౌకర్యార్థం స్టాళ్ల ద్వారా తినుబండారాలతో పాటు ఆధ్యాత్మిక వస్తువులు, పుస్తకాలు ప్రదర్శించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి సెయింట్ ఎలాసిస్ పాఠశాలలో వసతి సౌకర్యం కల్పిస్తారు.

ఈసారి జ్ఞాపకాలే..

ఈ ఏడాది విశాఖకు దూరంగా నేవీ డే వేడుకలు

- కదన రంగ విన్యాసాలకు దూరమైన నగరవాసులు
- తొలిసారిగా విశాఖలో కాకుండా ఒడిశాలోని పూరీలో నిర్వహణ
- నేడు కేవలం విక్టరీ ఎట్ సీ వద్ద అమరవీరులకు శ్రద్ధాంజలి









నేవీడే నాడు విశాఖ తీరంలో జరిగే యుద్ధ విన్యాసాలు

విశాఖ సిటీ : గగనతలంలో యుద్ధ విమానాల హోరు ఉండదు. సముద్రంలో నావికాదళ నౌకల సందడి కనిపించదు. తీరం వెంబడి బాంబుల మోత వినిపించదు. ప్యారాచ్యూట్ ప్రదర్శనలు.. ఇసుక తెన్నుల్లో ట్యాంకర్ల పరుగులు.. శత్రు స్థావరాలపై విరుచుకుపడే మెరైన్ కమాండోలు.. ఇలా కదన రంగాన్ని తలపించే కళ్లు చెదిరే ప్రదర్శనలు.. ఈ ఏడాది జ్ఞాపకాలు గానే మిగిలిపోనున్నాయి. భూమి, ఆకాశం, సముద్ర జలాల్లో ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు తిలకించే అవకాశం నగర వాసులకు ఈ ఏడాది లేకుండా పోయింది. ఐదు దశాబ్దాలకు పైగా బీచ్ రోడ్డులో జరుగుతున్న నేవీ డే వేడుకలు ఈసారి విశాఖకు దూరమయ్యాయి. ఈ ఏడాది నేవీ డేను ఒడిశా రాష్ట్రంలోని పూరీలో నిర్వహించాలని భారత నౌకాదళం నిర్ణయించింది. దీంతో ఏటా డిసెంబర్ 4వ తేదీన జనసంద్రంతో కళకళలాడే సాగరతీరం ఇప్పుడు బోసిపోనుంది. అయితే నేవీ డే వేడుకలు దూరమైనప్పటికీ జనవరి 4వ తేదీన విశాఖ సాగర తీరంలో అదే తరహాలో విన్యాసాలు నిర్వహించాలని తూర్పు నావికాదళ అధికారులు నిర్ణయించారు.

ఐదు దశాబ్దాలకు పైగా..

1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో భారత నౌకాదళం ప్రదర్శించిన సాంకేతిక ప్రతిభా పాటవాలు, వ్యూహాలు, ధైర్యసాహసాలకు గుర్తుగా ఏటా డిసెంబర్ 4వ తేదీన భారత నౌకాదళ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఆ రోజున తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో సాగర తీరంలో భారత నౌకాదళ సామర్థ్యాలను ప్రదర్శించేవారు. ఐదు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలు ఈ ఏడాది మనకు కనిపించవు. ఇన్నాళ్లలో కేవలం రెండుసార్లు మాత్రమే ఈ వేడుకలను రద్దు చేశారు. 2012లో మాజీ ప్రధాని ఐకే గుజ్రాల్ మరణించిన సమయంలోను, 2020లో కోవిడ్ కారణంగా వేడుకలను నిర్వహించలేదు.

కళతప్పిన సాగరతీరం

ఏటా నవంబర్ మూడో వారం నుంచి విశాఖ సాగర తీరంలో నేవీ డే సందడి కనిపించేది. రెండు వారాలు ముందుగానే యుద్ధ విన్యాసాలు, నౌకలు విశాఖ సాగర జలాల్లో దర్శనమిచ్చేవి. కానీ ఈసారి నేవీ డే వేదిక పూరీకి మారడంతో ఇక్కడ సందడే లేకుండా పోయింది. నేవీ డే ముందు నిర్వహించే రిహార్సల్‌ను తిలకించడానికి పెద్ద ఎత్తున ప్రజలు, పర్యాటకులకు విశాఖ సాగర తీరానికి వస్తుండేవారు. ఈసారి అటువంటి పరిస్థితి లేదు.

తొలిసారి పూరీలో..

ఏటా విశాఖలో నిర్వహిస్తూ వచ్చిన నేవీ డే వేడుకలు తొలిసారిగా పూరీలో నిర్వహించాలని భారత నావికాదళం నిర్ణయించింది. ఒడిశా కూడా తూర్పు నావికాదళం పరిధిలోనే ఉంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సొంత రాష్ట్రం కావడంతో ఆమె అక్కడి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. తూర్పు నావికాదళానికి చెందిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, విమానాలు, హెలీకాప్టర్లు అన్నీ గత నెలలోనే ఒడిశా రాష్ట్రానికి చేరుకున్నాయి. అయితే బుధవారం విశాఖ బీచ్‌రోడ్డులో ఉన్న విక్టరీ ఎట్ సీ స్థూపం వద్ద నావికాదళ అధికారులు పుష్పగుచ్ఛాలు ఉంచి అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తారు.

జనవరి 4న విన్యాసాలు

ఈసారి నేవీ డే వేడుకలకు విశాఖ దూరమైనప్పటికీ.. తూర్పు నావికాదళ విన్యాసాలు మాత్రం నెల రోజుల తరువాత విశాఖవాసులకు కనువిందు చేయనున్నాయి. వచ్చే ఏడాది జనవరి 4వ తేదీన విశాఖ సాగర తీరంలో అదే తరహాలో ప్రదర్శనలు చేయాలని ఈఎన్‌సీ అధికారులు నిర్ణయించారు. నేవీ డే స్థాయిలో వేడుకలు జరగనప్పటికీ.. యుద్ధ నౌకల నుంచి బాంబుల మోతలు.. గగనతలంలో యుద్ధ విమానాల చక్కర్లు.. తీరం వెంబడి బాంబుల మోతలు.. ఇలా నావికాదళ యుద్ధ విన్యాసాలను వీక్షించే అదృష్టం కలగనుంది.